సాక్షి సంగారెడ్డి

గురువారం ၊ 23 ၊ నవంబర్ ၊ 2023



ఆటలు అట్టహాసంగా..

సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే గురుకులం వేదికగా నాలుగు రోజులపాటు కొనసాగే ఈ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸



శిలాఫలకం ధ్వంసం

హుస్నాబాద్ ఐఓసీ భవనం ఎదుట ప్రభుత్వ భూమిలో టీఎన్జీఓ భవనానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు.

వివరాలు 10లో ▸



ఆశీర్వాదసభను..

జహీరాబాద్ పట్టణంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాదసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు, ఎన్నికల ఇన్‌చార్జి దేవిప్రసాద్ పిలుపు ఇచ్చారు.

వివరాలు 11లో ▸

వలస ఓటర్లపై అభ్యర్థుల గురి

- పోలింగ్ రోజున రప్పించేందుకు ఏర్పాట్లు
- మద్దతు కూడగట్టేందుకు రాయబారాలు
- విజయంలో వారి ఓట్లే కీలకం
- కీలక నేతలకు బాధ్యతలు



జహీరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు వలస ఓటర్లపై దృష్టి సారించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఓటు కీలకం కావడంతో వలస ఓటర్లను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. జీవనోపాధి, ఉద్యోగాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిని గుర్తించి, పోలింగ్ రోజున రప్పించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఓటు పడుతుందనే నమ్మకం ఉన్న వారికే తొలి ప్రాధాన్యతగా గుర్తిస్తున్నారు. వలస ఓటర్ల సంబంధీకుల ఆరా తీసి వారికి కీలక నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎవరెవరున్నారు

ఉపాధి నిమిత్తం ఎవరెవరు ఎక్కడెక్కడ ఉన్నారనే దానిపై అభ్యర్థుల అనుచరులు దృష్టిసారించారు. జిల్లాకు చెందిన ఓటర్లు ప్రధానంగా హైదరాబాద్ నగరంతో పాటు తాండూర్, వికారాబాద్, పరిగి, మెదక్, సిద్దిపేట, బెంగుళూరు, పూణే, బీదర్, బాల్కి, హుమ్నాబాద్ గుల్‌బర్గా, ముంబై తదితర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వేలాది మంది వలస వెళ్లారు. వీరితో పాటు ఉద్యోగ, వ్యాపార, ఉపాధి, పిల్లల చదువుల నిమిత్తం హైదరాబాద్ జంట నగరాల్లో నివాసం ఉంటున్నారు. వీరి మద్దతు కూడగట్టేందుకు రాజకీయ పార్టీల నేతలు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామాలవారీగా, పట్టణాల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలు తీసుకుని ఓటర్ల వివరాలు, వారు ఉంటున్న చిరునామా, సెల్‌ఫోన్ నంబర్లు గుర్తించి సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పోలింగ్ రోజున స్వస్థలాలకు రావడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇస్తున్నారు. రవాణా చార్జీలతో పాటు భోజనం, ఇతర ఖర్చులకు అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఓటర్లను సమన్వయం చేసి ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు రప్పించే బాధ్యతలను కొంత మంది కీలక నేతలకు అప్పగించినట్లు తెలిసింది.

హైదరాబాద్‌లోనే అధికంగా..

దేశంలోని పలు ప్రాంతాల్లో జిల్లాకు చెందిన ఓటర్లు సుమారు 20 వేలకు పైగానే ఉన్నారు. వీరిలో అధికంగా హైదరాబాద్ జంట నగరాల్లోనే ఉంటున్నారు. చందానగర్, బీహెచ్ఈఎల్, లంగర్‌హౌజ్, టోలీచౌకి, మెహిదీపట్నం, ఎల్‌బీ నగర్, హిమాయత్‌నగర్, బీరంగూడ, బాలానగర్, సికింద్రాబాద్, మూసాపేట్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ఉన్నారు. దీంతో రాజకీయ పార్టీలు వీరి ఓట్లపైనే ప్రధానంగా దృష్టి పెట్టింది. హైదరాబాద్ నగరం సంగారెడ్డి జిల్లాకు సమీపంలోనే ఉండటంతో ఓటర్లను రప్పించడం పెద్ద కష్టం కాదని ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. కొందరికి పోలింగ్ రోజున రప్పించేందుకు కొంత అడ్వాన్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఖర్చును నిశితంగా పరిశీలించాలి

రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్


మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్ అన్నారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్పీ, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు జయకర్, విజయ్‌కృష్ణ వేలాను, అదనపు కలెక్టర్లు, ఎక్స్‌పెండిచర్, ఎంసీసీ, ఎంసీఎండీ నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశమై, ఎన్నికల ఖర్చులు, బ్యాంకు లావాదేవీలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను మరింత నిశితంగా పరిశీలించాలన్నారు. బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా మద్యం, డబ్బు, బహుమతుల పంపిణీ తదితరాల అంశాలపై గట్టి నిఘా పెట్టాలని సూచించారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్, రాష్ట్ర వ్యయ ప్రత్యేక పరిశీలకులకు చేపట్టిన చర్యల గురించి వివరించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 102 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఇందుకు 1609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్ స్లిప్పుల పంపిణీ 98 శాతం పూర్తయిందన్నారు. తనిఖీలు, శాంతి భద్రతలకు తీసుకుంటున్న చర్యలు, బందోబస్తు వివరాలు ఎస్పీ రూపేష్ వివరించారు. ముందుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎంసీఎంసీ, సీవిజిల్, గ్రీవెన్స్ కేంద్రం, కంట్రోల్ రూమ్‌లను సందర్శించారు. సమీక్షలో ఎక్సైజ్, ఇన్ కంటాక్స్, జీఎస్టీ అధికారులు, ఎల్‌డీఎం, సంబంధిత నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు

శాసనసభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్ జిల్లాల ఎన్నికల అధికారులకు సూచించారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పోలింగ్ నిర్వహణకు చేపట్టిన చర్యల గురించి జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, ఏఓ పరమేష్, ఎన్ఐసీ అధికారి విద్యాసాగర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎన్నికల జనరల్ అబ్జర్వర్ పర్యటన


ఓటర్ స్లిప్పులను పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నజీమ్ జై ఖాన్

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గ్రామంలో పటాన్‌చెరు ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నజీమ్ జై ఖాన్ బుధవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ స్లిప్పులు వచ్చాయా లేదా అని ఆరా తీశారు. పంపిణీ చేసిన ఓటర్ స్లిప్పులను పరిశీలించారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

23న ఎన్నికల పోలింగ్ సిబ్బందికి శిక్షణ

సంగారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికల సిబ్బందికి ఈనెల 23వ తేదీన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ శిక్షణకు విధిగా హాజరుకావాలని లేకుంటే చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో ఎన్నికల సిబ్బంది శిక్షణకు హాజరుకానట్లయితే 23వ తేదీన నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు. సాధారణ ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల శిక్షణకు హాజరుకాకున్నా, ఆదేశాలను విస్మరించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వారే కీలకం

ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా


పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇస్తున్న అధికారి

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నిర్వహణకు పీఓ (ప్రొసీడింగ్ ఆఫీసర్), ఏపీఓ (అసిస్టెంట్ ప్రొసీడింగ్ ఆఫీసర్) కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో రోజు పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో 465 మందిగాను 16 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ జిన్నారం తహసీల్దార్ రవికుమార్, ఆర్సీపురం తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు అమరేందర్ రెడ్డి, యోగి బాబు, చంద్రారెడ్డి మోహన్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

సంగారెడ్డి టౌన్: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపారు. బుధవారం సంగారెడ్డి మండలం ఇరుగుపల్లి గ్రామంలో నాగరాజుగౌడ్ తరలిస్తున్న 8.640 లీటర్ల మద్యం, మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని నారాయణరెడ్డి కాలనీలో మద్యం విక్రయిస్తుండగా భాగయ్య నుంచి 5.40 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారున. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్ మాణిక్ గౌడ్, ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రభాకర్, రవీందర్, సుభాష్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్


గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పటాన్‌చెరు శివారులోని కృషి డిఫెన్స్ కాలనీలో అలీ గంజాయి విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 610 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాస్, రాములు, సిబ్బంది చారి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారు

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప


మాట్లాడుతున్న యడ్యూరప్ప

జహీరాబాద్: తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో ఇచ్చిన హామీలను నమ్మొద్దని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప అన్నారు. బుధవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి రాంచందర్ రాజనర్సింహా మద్దతుగా ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటిని విస్మరించిందన్నారు. రైతుల సంక్షేమం కోసం తాను ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయకుండా రైతులకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. తాను ప్రవేశపెట్టిన పలు పథకాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సిద్ధిరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య విభేదాలతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఖజానా సైతం ఖాళీ అయ్యిందని, దీంతో ప్రభుత్వం దివాలా తీసిందని ఆరోపించారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలనే అమలు చేయలేని పరిస్థితిలో అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, తెలంగాణలో ఇచ్చిన హామీలను ఎలా అమలు చేయగలుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో కీచులాటలు తప్ప ఏమీ లేదన్నారు. మోదీ నాయకత్వాన్ని మరింత బలపర్చేందుకు రాంచందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే అభివృద్ధి


సభకు హాజరైన జనం


బహిరంగ సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

- బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులు ఎందుకు పూర్తి కాలేదు
- ఖేడ్ సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

నారాయణఖేడ్: నిరుద్యోగులకు ఉద్యోగాలు, చక్కెర పరిశ్రమలు రావాలన్నా, బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లో నిర్వహించిన విజయభేరి సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే దొరలను గద్దెదించడం సాధ్యమవుతుందని, ప్రగతిభవన్ గేట్లు బద్దలు కొట్టగలమన్నారు. రైతు భరోసా ద్వారా ఎకరాకు ఏటా రూ.15 వేలు, భూమిలేని కూలీలకు రూ.12వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని కుర్చీవేసుకొని కూర్చుని ఏడాదిలోగా పూర్తిచేస్తానని చెప్పిన కేసీఆర్, ఫాంహౌస్‌లో నిద్రించాడని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న ఏర్పాటయ్యే ఇందిరమ్మ రాజ్యంలో పచ్చని పంటలతో ఖేడ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కేసీఆర్‌లాగే ఇక్కడి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి భూకబ్జాలకు, కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఎంపీటీసీలపై అక్రమ కేసులు బనాయించి బెదిరించి గులాబీ కండువాలు కప్పారని ఆరోపించారు. సమయం వచ్చింది సత్తా చూపాలని, పెండింగ్ బిల్లులు రావాలి, సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు చేసి తీరుతామన్నారు. ఇక్కడ షెట్కార్, సంజీవరెడ్డి కుటుంబాలు కలిసుంటే కాంగ్రెస్‌కు ఎప్పుడూ ఎదురుండదని అన్నారు. సురేశ్ షెట్కార్ తన అసెంబ్లీ టికెట్‌ను త్యాగం చేసి సంజీవరెడ్డికి ఇచ్చి గెలిపించేందుకు కృషి చేస్తున్నారని, ఆయనకు జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో స్థానికంగా బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డిని గెలిపిస్తే దొర గడిలో ఉన్న వంద గాడిదల్లో 101 గాడిద అవుతుందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

ఖేడ్ సమగ్ర అభివృద్ధి

నారాయణఖేడ్ నియోజకవర్గం పదేళ్లలో తీవ్ర సమస్యలో కొట్టుమిట్టాడుతోందని, డిసెంబర్ 9 తర్వాత అభివృద్ధి ఫలాలు ప్రసరించనున్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన, ప్రాంత సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. సభలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్, నగేష్ షెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సువాసినీ పూజ


సువాసిని పూజలో పాల్గొన్న మహిళలు

నారాయణఖేడ్: లోక కల్యాణార్థం నారాయణఖేడ్‌లో లలిత వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో పురోహితుడు మోహన్ జోషి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహారుద్ర సహిత శతచండీ యాగ పురస్సరతు ర్వేద స్వాహాకార సుదర్శన మహాయాగం, రాజశ్యామల యాగం వైభవంగా నిర్వహించారు. ఈనెల 18న ప్రారంభమైన కార్యక్రమాలు బుధవారం రాత్రి పూర్ణాహుతితో ముగిశాయి. కార్యక్రమం చివరి రోజు మహిళలు సువాసినీ పూజ చేశారు. చిన్నారుల పేరిణీ నృత్య ప్రదర్శన, రుత్విక్కుల సన్మానం తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అంతర్జాతీయ పత్ర సమీక్షకు ఎంపిక

పటాన్‌చెరు: అమెరికా(ఫ్లోరిడా)లోని గ్రేటర్ మయామిలో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు సమర్పించిన పరిశోధనా పత్రాలను సమీక్షించడానికి గీతం అధ్యాపకుడికి అవకాశం లభించింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమరాజు సమీక్షకుడిగా ఎంపికయ్యారు. ప్రపంచంలో ఉన్న నిపుణులకు ఒకచోటకు చేర్చే లక్ష్యంతో అమెరికా (ఫ్లోరిడా)లోని గ్రేటర్ మయామిలో 2024 ఏప్రిల్ 15 నుంచి 18 తేదీల్లో నిర్వహిస్తున్నారు. శాస్త్ర, సాంకేతిక, నిర్మాణం, భూమి, చంద్రుడు, అంగారక గ్రహం వెలుపల వాతావరణాలపై నిపుణులు ఈ సదస్సులో సమీక్షించనున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


హత్నూరలో ప్రతిజ్ఞ చేస్తున్న ఓటర్లు

హత్నూర(సంగారెడ్డి): ప్రజలు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ నియోజకవర్గ నోడల్ అధికారులు బ్రహ్మాజీ, హేమభార్గవి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన హత్నూరలోని ఐటీఐ కాలనీతోపాటు ఐకేపీ కార్యాలయంలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీన జరిగే శాసనసభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. హత్నూర, దౌల్తాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభారాణి, ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ, టీచర్లు, ఆయాలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అష్టోత్తర సహస్ర కుంభాభిషేకం


అష్టోత్తర సహస్ర కుంభాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట బల్కంచెల్క తండాలో శ్రీ విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహారాజు మహా మందిరంలో బుధవారం అష్టోత్తర సహస్ర కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. మెడ్చల్ జిల్లా రవాణ శాఖ అధికారి, మందిరం ధర్మకర్త మూడ్ కిషన్‌సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో ఆవాహిత దేవతా హోమాదులు, అభిషేకం, మహానైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ కార్యక్రమాలు జరిగాయి.

పాత కమాన్ దారి మూసివేత



దారి మూసివేస్తున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే పాత కమాన్ దారి మూసివేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సిద్దిపేట నుంచి కొమురవెల్లి వచ్చే వాహనాలు, భక్తులు గౌరయపల్లి గుండా, హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు తిమ్మారెడ్డిపల్లి కమాన్ మీదుగా కొమురవెల్లికి చేరుకోవాలని తెలిపారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

చెరకు బకాయిలు చెల్లించేందుకు అంగీకారం

నేటి బంద్‌ను విరమించుకున్న రైతు సంఘం నేతలు


రైతు సంఘం నాయకులతో సమావేశమైన ఆర్డీఓ వెంకారెడ్డి

జహీరాబాద్ (జహీరాబాద్): చెరకు రైతులకు బకాయిలను చెల్లించేందుకు ట్రైడెంట్ యజమాన్యం సమ్మతించింది. బుధవారం రాత్రి ఆర్డీఓ వెంకారెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు, ట్రైడెంట్ యజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ట్రైడెంట్ యజమాని రామ్‌నాథ్ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి దశలవారీగా బకాయి చెల్లిస్తానన్నారు. రూ.కోటి చొప్పున పక్షం రోజుల్లో చెల్లిస్తానని చెప్పారు. అంతేకాకుండా డిసెంబర్‌లో క్రషింగ్ సైతం చేపడతామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. ఇందుకు సంతృప్తి చెందిన రైతు సంఘం నాయకులు ఈనెల 23వ తేదీన నిర్వహించ తలపెట్టిన జహీరాబాద్ బంద్‌ను విరమిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో డీఎస్పీ రఘు, రైతు సంఘం నాయకులు కొండల్ రెడ్డి, ఢిల్లీ వసంత్, ఎంజి రాములు, జగనాథ్‌రెడ్డి, జ్యోతి, వెంకట్‌రెడ్డి, గండ్ రెడ్డి, నాగిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ యాజమన్యం చెప్పినట్లుగా బకాయి చెల్లించకుంటే ఆందోళన కొనసాగుతుందన్నారు.

క్లుప్తంగా

రూ.1.01 లక్షలు సీజ్

వర్గల్(గజ్వేల్): ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 1,01,000 నగదును ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు వర్గల్ మండలం గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపారు. బుధవారం గౌరారం వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా అశోక్ లేలాండ్ ట్రాలీ ఆటోలో వ్యక్తి వద్ద నగదు గుర్తించామన్నారు. సీజ్‌చేసిన నగదు వర్గల్ ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అందజేశామన్నారు.

కేసీఆర్‌కే మా ఓటు..

తీర్మాన ప్రతులు హరీశ్‌రావుకు అందజేత



తీర్మాన ప్రతులు మంత్రి హరీశ్‌రావుకు అందిస్తున్న సభ్యులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ఆర్‌ఎంపీల సంఘం సభ్యులు, రాయవరం గ్రామంలో హమాలీ సంఘం సభ్యులు ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కే మా ఓటంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనికి సంబంధించిన ప్రతులను బుధవారం మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు. కుకునూరుపల్లి మండల ఏర్పాటు 30 ఏళ్ల కలను సాకారం చేసినందుకు గ్రామాల్లో ప్రజలకు సకాలంలో వైద్యం అందేలా ఆర్‌ఎంపీలకు సహకరిస్తున్నందుకు కేసీఆర్‌కు ఓటు ద్వారా రుణం తీర్చుకుంటామంటూ స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పావణి, కొండపోచమ్మ దేవాలయ డైరెక్టర్ లక్ష్మణ్‌రాజు, ఆర్‌ఎంపీలు సుదర్శన్, లగిశెట్టి కనకయ్య పాల్గొన్నారు.

మిత్రమా రాత్రి కలుద్దాం..

పగలు ప్రచారం.. రాత్రి వ్యూహం

- ప్రణాళికతో ముందుకెళ్తున్న అభ్యర్థులు
- సామాజికవర్గాల వారీగా సమావేశాలు
- కులపెద్దలతో మంతనాలు
- ఓటర్లను ఆకర్షించేందుకు పడరాని పాట్లు



జంగ్ తెలంగాణ

జోగిపేట (అందోల్) : ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ముమ్మరవుతోంది. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇందులో భాగంగా అనుచరుల్లోని ముఖ్యులను రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా సామాజికవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి ముందస్తుగా హామీలు ఇచ్చి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు సాగిస్తూ అభ్యర్థులతోపాటు వారి అనుచరులు పడరాని పాట్లు పడతున్నారు. అన్ని సామాజిక వర్గాల మద్దతు లభిస్తే విజయం సునాయాసమన్న భావనలో అభ్యర్థులున్నారు. కుల సంఘాల వారీగా ఓటర్లను గుర్తించేందుకు ప్రత్యేకంగా టీమ్‌ను తయారు చేసుకొని తీసివేతలు, కూడికలు మొదలుపెట్టారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్లి ఓట్లు అడిగే సమయం లేదు. దీంతో ప్రధాన గ్రామాలపై దృష్టి సారించిన నేతలు పగలు ప్రచారం చేస్తూ రాత్రి వేళ మంతనాలు చేస్తున్నారు.

కులపెద్దలతో మంతనాలు

ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు కులాలు, మతాల వారీగా ఓటర్లను గుర్తించి ఆయా వర్గాలకు చెందిన పెద్దలతో మంతనాలు చేస్తున్నారు. ప్రతిరోజూ సమయం దొరికినప్పుడల్లా ఫోన్లలో వారిని అప్యాయంగా పలుకరించి గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. ఇదే సమయంలో స్థానిక సమస్యలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వారితో ప్రస్తావించి గెలిచిన వెంటనే పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. ప్రతీ ఎన్నికల్లో కొన్ని సామాజికవర్గాలు అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తున్నాయి. అలాంటి సామాజికవర్గాన్ని గ్రామాల వారీగా గుర్తించేందుకు అభ్యర్థులు పక్కా ప్రణాళిక రూపొందించుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు కలిగి ఉన్న సామాజికవర్గాన్ని గుర్తించి వారి మద్దతును తమవైపు తిప్పుకునే పనిలో పడ్డారు. నియోజకవర్గంలో 40 నుంచి 45శాతం ఓటర్ల మద్దతును కూడగట్టుకుంటే విజయం తథ్యమనే భావన అభ్యర్థుల్లో నెలకొంది.

రెండు వైపులా వారే...

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరిని నమ్మాలో..? ఎవరిని దూరంగా ఉంచాలో అర్థం కాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉదయం ఓ అభ్యర్థి ప్రచారంలో కనిపిస్తున్న వ్యక్తులు చీకటి కాగానే మరో అభ్యర్థి శిబిరంలో చేరిపోతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని నమ్మబలుకుతున్నారు. మందు, విందు పార్టీల్లో మునిగి తేలుతున్నారు. ఒక్కరుగా వెళ్లకుండా కొంత మందిని పోగేసుకొని వెళ్తున్నారు. వీరిని బుజ్జగించడానికి అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. మరికొందరు ఇప్పటికే ఫిరాయింపులకు పాల్పడి చేరిన పక్షం వైపు చక్రం తిప్పుతున్నారు.

ఎన్నికల సిత్రాలు

చకాచకా కత్తిరిస్తా.. ఓటు పట్టేస్తా..



మంత్రి హరీశ్ రావుకు మద్దతుగా సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లక్షన్నర మెజార్టీ లక్ష్యంగా ప్రతీ ఒక్కరినీ ఓట్లు అడుగుతున్నారు. స్థానిక భారత్‌నగర్‌లో ఒక దర్జీ షాపులో బట్టలను కొలత మేరకు కత్తిరించి, పనిలో పనిగా ఓట్లు అడిగారు.

– సిద్దిపేటజోన్

ముద్ద పెట్టుకో.. గుర్తు పెట్టుకో..



చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా బుధవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి. ఇందులో భాగంగా ఓ వృద్ధుడికి చెంచాతో అన్నం తినిపిస్తూ ఓటు అభ్యర్థించాడు. ఆయన వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు పలువురు ఉన్నారు.

అభిమానానికి నిలువెత్తు ఆదారం



సిద్దిపేటకు చెందిన ముగ్గురు యువకులు రెండు వారాలు శ్రమించి దాదాపు 6 కిలోమీటర్ల పొడవైన దారంతో, 4 వేల మలుపులతో, ఆరు మీటర్ల ఎత్తు, ఆరు మీటర్ల పొడవునా త్రేడ్ ఉపయోగించి మంత్రి హరీశ్‌రావు బొమ్మ రూపకల్పన చేశారు. బుధవారం మంత్రి నివాసంలో ఆర్ట్ బొమ్మను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువకులు వినయ్, బాలాజీ, సంతోష్‌ను హరీశ్‌రావు అభినందించారు.

– సిద్దిపేటజోన్

అభివృద్ధిని అడ్డుకోవడమే వారి పని

- ఇక్కడ పరిశ్రమలు రాకుండా చేసింది కాంగ్రెస్ నాయకులే..
- ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన నిరుద్యోగులు
- అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ విమర్శలు



ప్రచారంలో మాట్లాడుతున్న క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక పనులను అడ్డుకోవడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ మండిపడ్డారు. బుధవారం మండలంలోని పెద్దలోడి, లింగంపల్లి, కంకోల్, బోడపల్లి, తక్కడపల్లి, ఖమ్మంపల్లి, మునిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో క్రాంతికిరణ్‌కు మంగళహారతులు ఇచ్చి మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. ఇక్కడి నిరుద్యోగ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ మునిపల్లి మండలం లింగంపల్లి, కంకోల్, మగ్దుంపల్లి గ్రామ శివారులో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను మంజూరు చేశారన్నారు. కోర్టులో కేసులు వేసి పరిశ్రమ ఏర్పాటు కాకుండా దామోదర రాజనర్సింహ అడ్డుకున్నారని దుయ్యబట్టారు. పరిశ్రమ ఏర్పాటై ఉంటే సుమారు 5,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవని ఆవేదన వ్యక్తం చేశారు. కారు గుర్తుకు మరోసారి ఓటేసి మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా, రెండోసారి నన్ను అందోల్ ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీనాక్షి, ఎంపీపీ శైలజా, ఎంపీపీ ఉపాధ్యక్షుడు ఖమ్రొద్దీన్, మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య, మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, విజయ్ కుమార్, శివశంకర్, శశికుమార్, వెంకటేశం, రాంచందర్‌రావు, నవాజ్‌రెడ్డి, మొగులయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్) : మండలంలోని కుసునూర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మహేశ్, మండల సంఘం నాయకుడు మాణిక్ తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలయ్య, బసవరాజ్ పాటిల్, విఠల్, శివకుమార్ పాటిల్, బస్వరాజ్, శంకర్, సంగమేశ్వర్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే వందేళ్లు వెనక్కి

- తప్పుదారి పట్టించేందుకే ఆరు గ్యారంటీల ఎర
- బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



సదాశివపేట పట్టణంలోని 8వ వార్డులో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): కాంగ్రెస్‌ను నమ్మితే వందేళ్లు వెనక్కి పోతామని బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని 5, 6, 7, 8, 21, 22, 23, 24 వార్డుల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకే కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీనిచ్చిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లోడి జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు వడ్ల మహేశ్వరి, ఇంద్రమోహన్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ కోడూరి అంజయ్య, మాజీ కౌన్సిలర్లు సతాని శ్రీశైలం, అన్మిశెట్టి మల్లేశం, జిల్లాగౌడ సంఘం అధ్యక్షుడు పెద్దాగౌడ్, పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, పట్టణ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోపణలను నమ్మొద్దు

- తడ్కల్‌ను మండలంగా ఏర్పాటు చేస్తాం
- బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి

కంగ్టి(నారాయణఖేడ్): బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను నమ్మొద్దని బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి, ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తడ్కల్, ఘన్‌పూర్, తుర్కవడ్‌గాం, నాగుర్(కే), భీంరా, కంగ్టి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తడ్కల్‌లో మున్నూరు కాపు సంఘం, పద్మశాలి సంఘం సభ్యులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో తడ్కల్ మండలం ఏర్పాటు జీఓ విడుదల చేసినట్లు తెలిపారు. కానీ.. కాంగ్రెస్ నాయకులు మండలం ఏర్పాటు బూటకం అంటూ ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కోట ఆంజనేయులు, మనోహర్, సుభాష్‌రావు పాటిల్, సత్యనారాయణ, గోపాల్‌రావుపాటిల్, బాబుపటేల్ తదితరులు పాల్గొన్నారు.



కల్హేర్: ప్రచారం నిర్వహిస్తున్న భూపాల్‌రెడ్డి కుమార్తె శ్రేయారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు చూసి కారు గుర్తుకు ఓటేయాలని ఆ పార్టీ అభ్యర్థి భూపాల్‌రెడ్డి కుమార్తె శ్రేయారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సిర్గాపూర్ మండల కేంద్రంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాఘవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో జాప్యం సరికాదు

గజ్వేల్‌రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌లో జాప్యం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బుధవారం గజ్వేల్‌లో వారు మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫాం 12 దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, సిబ్బందికి శిక్షణ సమయంలో పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు దరఖాస్తు పూర్తి చేసి తీసుకున్నట్లు తెలిపారు. కాగా మళ్లీ శిక్షణ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ పంపిస్తామని అధికారులు చెప్పడం వల్ల ఎన్నికల సిబ్బంది అయోమయానికి గురవుతున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల ఉద్యోగులు సిద్దిపేట జిల్లాలో ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.

సర్వే రిపోర్ట్సతో కేసీఆర్ నారాజ్

ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్



మాట్లాడుతున్న క్రిస్టోఫర్ తిలక్

హుస్నాబాద్: అన్ని సర్వే రిపోర్ట్స్ కాంగ్రెస్ వైపే ఉన్నాయని తెలిసి సీఎం కేసీఆర్ నారాజ్‌గా ఉన్నారని ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టోఫర్ తిలక్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలోని చిన్న ముల్కనూర్‌ను దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, హుస్నాబాద్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని చెప్పిన మంత్రి హరీశ్‌రావు మాటలను ఏ ప్రాంత ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ పొన్నం ప్రభాకర్‌కు మద్దతుగా ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్ అధినేత్రి ప్రియాంక గాంధీ హుస్నాబాద్‌కు వస్తున్నట్లు వెల్లడించారు.పట్టణంలోని అమరుల స్థూపం వద్ద భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని, సభకు దాదాపు 45 వేల మందిని తరలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ పరిశీలకులు గోపినాథ్ పళనియాప్పన్, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటలు అట్టహాసంగా..

- వర్గల్ గురుకులంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న మల్లయ్యభట్టు, తదితరులు



ఆటల పోటీల సందర్భంగా క్రీడాకారుల ఓత్ టేకింగ్ దృశ్యం

వర్గల్(గజ్వేల్): జ్యోతిబా పూలే బీసీ గురుకులాల బాలికల రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు తెరలేచింది. సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే గురుకులం వేదికగా నాలుగు రోజులపాటు కొనసాగే ఈ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు ఆతిథ్య ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి 1,000 మందికిపైగా క్రీడాకారులు వర్గల్ చేరుకోవడంతో పాఠశాల ప్రాంగణమంతా నిండుదనం సంతరించుకుంది. క్రీడాకారులు, విద్యార్థులు, ముఖ్యఅతిథులు, క్రీడాభిమానులతో గురుకుల ప్రాంగణం కిటకిటలాడింది. టోర్నీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జ్యోతిబా పూలే బీసీ గురుకులాల సొసైటీ సెక్రటరీ మల్లయ్య భట్టు, ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాస్ హాజరయ్యారు. వారికి మెదక్ ఆర్సీఓ ప్రభాకర్, ఆతిథ్య గురుకుల ప్రిన్సిపాల్స్ లక్ష్మీదేవి, భాస్కర్‌రావు బృందం విద్యార్థులతో కలిసి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి జిల్లాల వారీగా బాలికల మార్చిఫాస్ట్ కొనసాగింది. ముఖ్యఅతిథులు గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఓత్ టేకింగ్ కార్యక్రమాలు వరుసగా జరిగాయి. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తొలిరోజు హోరాహోరీగా..

అండర్–19 విభాగంలో ఖమ్మం, కరీంనగర్ జట్ల మధ్య కబడ్డీ తొలి పోటీ జరిగింది. ఖమ్మం విజేతగా నిలిచింది. అదే విధంగా అండర్–19 వాలీబాల్ పోటీ రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల మధ్య జరగగా రంగారెడ్డి జిల్లా జట్టు గెలిచింది. పోటీల సందర్భంగా క్రీడాప్రాంగణం కేరింతలు, చప్పట్లతో హోరెత్తింది.

టీఎన్‌జీఓ భవన శిలాఫలకం ధ్వంసం

- పోలీసులకు ఫిర్యాదు



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఐఓసీ భవనం ఎదుట ప్రభుత్వ భూమిలో టీఎన్‌జీఓ భవనానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. సెప్టెంబర్ 13న మంత్రి హరీశ్‌రావు ఐఓసీ భవనము ప్రారంభించిన రోజే టీఎన్‌జీఓ భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ భూమిని రియల్ వ్యాపారులు ఆక్రమించి ప్లాట్‌లు చేసి విక్రయించారు. ప్లాట్‌లు కొనుగోలు చేసినవారు విక్రయించిన వారిపై ఒత్తిడి తేవడంతో అర్ధరాత్రి ఎవరూలేని సమయంలో శిలాఫలకమును ధ్వంసం చేశారని టీఎన్‌జీవో నాయకులు పోలీసులకు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకమునే ధ్వంసము చేసిన వారు రేపు కార్యాలయాల్లోని రికార్డులను మాయం చేయరనే నమ్మకము ఏందంటున్నారు. దోషులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని టీఎన్‌జీఓ సంఘము నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళ హత్య

మనోహరాబాద్ (తూప్రాన్): పరిశ్రమలో పని చేయడానికి వచ్చిన మహిళ హత్యకు గురైంది. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. కాళ్లకల్ గ్రామ శివారులో సర్వేనంబర్ 86లో గల గీతా ప్యానల్ ప్రాడక్ట్ పరిశ్రమ ఉంది. కాగా రెండేళ్ల క్రితం సూరజ్, రజనీదేవి చౌహాన్ (40) పరిశ్రమలో పని కోసం వచ్చారు. వారికి పని ఇచ్చి పరిశ్రమలోనే లేబర్ గదిని కేటాయించినట్లు పరిశ్రమ యజమాని ప్రవీణ్ పటేల్ తెలిపారు. కాగా ఈ నెల 19న సూరజ్ గదికి తాళం వేసి వెళ్లిపోయాడు. కాగా బుధవారం గదిలో నుంచి దుర్వాసన రావడంతో కార్మికులు యజయాని ప్రవీణ్ పటేల్‌కు సమాచారమిచ్చారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పరిశ్రమ వద్దకు వచ్చి గది తలుపులు తీయగా కుళ్లిన స్థితిలో రజనీదేవి మృతదేహం కనిపించింది. దీంతో ఈమెను సూరజ్ హత్య చేసి వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.